క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మవారికి శనివారం అమ్మవారి పుట్టిన ఊరు అనిగండ్లపాడు నుంచి మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. వీరికి ఆలయం వద్ద చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు.

నేడు శాకంబరిగా తిరుపతమ్మ అమ్మవారి దర్శనం



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో శ్రీతిరుపతమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పెనుగంచిప్రోలు, పరిసరాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు, వివిధ సేవా సంఘాల వారు ఆలయంలో పలు రకాల కూరగాయలు, పండ్లతో మాలలు తయారు చేశారు. ఇందు కోసం వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు సమకూర్చారు. శాకంబరీ ఉత్సవం సందర్భంగా ఆలయంలో ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమం, రాత్రికి శాకంబరీ అలంకరణలో అమ్మవారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈఓ కె.రమేష్ నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు తెలిపారు.

వైద్యులు దేవుళ్లతో సమానం



నందిగామ: వైద్యులు దేవుళ్లతో సమానమని, రోగులకు వారు అందిస్తున్న సేవలు వెల కట్టలేనివని నాలుగవ వార్డు కౌన్సిలర్ మారం అమరయ్య అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాకుళ్లయ్య వీధిలో గల గణపతి ఆలయంలో శనివారం పలువురు వైద్యులను సన్మానించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ చిన్నా



నందిగామ: లయన్స్ క్లబ్ నందిగామ శాఖ నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నేత్ర వైద్యుడు డి.చిన్నకొండలరావు(చిన్నా) ఎన్నికయ్యారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో 2023–24 సంవత్సరానికి గాను కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.లక్ష్మీకాంత్, కోశాధికారిగా ఎం.ప్రసాద్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేను సత్కరించిన న్యాయవాదులు



నందిగామ టౌన్: శాసనసభ్యునిగా, వైద్యునిగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అందిస్తున్న సేవలు నిరుపమానమని ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, పలువురు న్యాయవాదులు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం రాత్రి జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ మట్టా ప్రసాద్, న్యాయవాదులు బొందలపాటి రామకృష్ణ, మన్నెం శ్రీనివాసరావు, ప్రసాదరావు, దాదాహుసేన్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గాయపడి చికిత్స పొందుతున్న యువతి మృతి

నందిగామ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణానికి చెందిన భరత్, దివ్య శుక్రవారం రాత్రి విజయవాడ వైపు నుంచి నందిగామకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. నందిగామ సమీపంలోకి రాగానే 65 వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శీలం దివ్య (22)కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రురాలిని మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రతి ఇంటి తలుపు తడుతున్న ప్రభుత్వం

- జుజ్జూరు, చెన్నారావుపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం
- క్యాంపులను సందర్శించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- లబ్ధిదారులకు సర్టిఫికెట్‌ల పంపిణీ



జుజ్జూరులో సర్టిఫికెట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: రాష్ట్రంలోని ప్రతి ఇంటి తలుపు తడుతున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని జుజ్జూరు-1, జుజ్జూరు-2 సచివాలయాల పరిధిలోని చెన్నారావుపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఆదాయ, కుల, జనన, మరణ, తదితర 11 రకాల సర్టిఫికెట్‌లు ఫీజు లేకుండా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలను కోల్పోకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు రమావత్ కోటి, పత్తిపాటి మల్లికార్జునరావు, తహసీల్దార్ ఆశయ్య నాయక్, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్ మీరా, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, పలువురు నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

చెవిటికల్లు(కంచికచర్ల): పేదల జీవన ప్రమాణాల స్థాయి పెంచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చెవిటికల్లులో జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామసభ శనివారం జరిగింది. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మేలు జరిగేలా వారి సమస్యలు పరిష్కారమయ్యేలా ఇంటింటికీ సిబ్బందిని పంపించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తోందన్నారు. చిన్న చిన్న సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత కోల్పోయిన వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చాలన్నదే సీఎం జగన్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుడ్డి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మార్త శ్రీనివాసరావు, మంగలపూడి కోటిబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, వీఆర్వో, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో జగనన్న సురక్షలో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



బూదవాడ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

కొత్తపేటలో...

కొత్తపేట(కంచికచర్ల): రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం మంచి చేస్తుందని, అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందకుండా ఎవరూ మిగిలిపోకూడదనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామసభ జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు అవసరమైన వారికి జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్‌సీ కార్డులు, రేషన్ కార్డు విభజన, హౌస్ హోల్డ్ డివిజన్ మొదలైన 11 రకాలు సర్వీస్ ఫీజు లేకుండా ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచి ప్రత్తిపాటి సునీత, ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రత్తిపాటి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి వనిత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



కొత్తపేటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీఓ రవీంద్రరావు

ప్రజాసంక్షేమార్థం జగనన్న సురక్ష

భీమవరం(వత్సవాయి): భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమార్థం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, శ్మశానవాటికకు ప్రహరీ, హైవేపై బస్టాండ్, పేదలకు ఇంటి స్థలాలతోపాటు ట్రామాకేర్ సెంటర్‌ను గ్రామ పరిధిలో ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భీమాల సుజాత, ఎంపీటీసీ కొమ్మెర చిన్నమ్మ, నర్ల సుధాకర్‌రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష , వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు, జేసీఎస్ మండల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, గ్రామ నాయకుడు చింతకుంట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క సమస్య పరిష్కరించేందుకే జగనన్న సురక్ష

నందిగామ టౌన్: ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. పట్టణంలోని 1వ సచివాలయం, అడవిరావులపాడు, కోనాయపాలెం, చందర్లపాడు-1 సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష శిబిరాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పథకాలు అందాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయా లబ్ధిదారులకు అరుణకుమార్ సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష జిల్లా ప్రత్యేకాధికారి శ్రీలత, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కమిషనర్ జయరాం, తహసీల్దార్ సుశీలాదేవి, కౌన్సిలర్లు పాకాలపాటి కిరణ్, తానూరి రాము, వైస్ ఎంపీపీ ఆకుల రంగ, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ

నందిగామ: రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు 11 రకాల సర్వీసులకు సంబంధించి జారీ అయిన సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం మరింత దగ్గర అయిందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, పార్టీ ఏటి పట్టు గ్రామాల నాయకులు లగడపాటి వీరయ్య, వీరాంజనేయులు, దేవినేని రామారావు, లగడపాటి పూర్ణ, గిరి, తహసీల్దార్ నరసింహారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో 1197 సర్టిఫికెట్లు అందజేత

నందిగామ పట్టణంతోపాటు మండలంలోని జొన్నలగడ్డ అడవి రావులపాడు గ్రామాలలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా 11 రకాల సర్వీసులకు చెందిన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అందజేశారు. జొన్నలగడ్డలో రూ.15.50 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. నందిగామ పట్టణంలోని ఒకటవ సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమం ద్వారా 470, అడవిరావులపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమం ద్వారా 387, జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో 337 సర్టిఫికెట్లను అందజేశారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకే జగనన్న సురక్ష

పేటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఉదయభాను



పేట 1 వ సచివాలయంలో లబ్ధిదారునికి రైస్ కార్డు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చిన జగనన్న ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసి అర్హులై పథకాలు అందని వారి వద్దకు వెళ్లి వారికి కావాల్సిన ధ్రువ పత్రాలను అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. స్థానిక ముక్త్యాల రోడ్‌లోని 9 వ సచివాలయంలో, కాకానినగర్ పాత గురుకుల పాఠశాలలోని 1 వ సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్యతో కలిసి పాల్గొన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, వార్డు కౌన్సిలర్ కొలగాని రాము, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, సచివాలయాల పట్టణ కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పింగళి నర్సింహారెడ్డి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహిద్దీన్, ఎస్టీసెల్ అధ్యక్షుడు బద్దూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టాలి

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్



పరిటాలలో క్వారీ దిబ్బను పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

పరిటాల(కంచికచర్ల): ప్రకృతి అందించిన ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసి పట్టుకుని చెరువులను నింపడం ద్వారా రైతాంగానికి సాగునీరు, పశువులకు తాగునీరు అందివ్వడంలో అమృత్ సరోవర్ సత్ఫలితాలను ఇస్తుందని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మండలంలోని పరిటాలలో శనివారం క్వారీ దిబ్బను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకం ద్వారా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో కుంటలు, చెరువులను అభివృద్ధి చేసి నీటి నిల్వల సామర్థ్యం పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. దిబ్బ చుట్టూ గట్లను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, గట్లపై ఫలసాయపు మొక్కలు నాటి సిమెంటు బల్లలను ఏర్పాటు చేయటం ద్వారా పార్కులను తలపించే వాతావరణాన్ని తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సునీత, జిల్లా పంచాయతీ అధికారి జయచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, ఏఈ లక్ష్మీసాయిశ్రీ, డీటీ నాగుల్‌మీరా, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, వైఎస్సార్ సీపీ నాయకులు యద్దనపూడి విజయారావు, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, కర్ల రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ-2గా బాధ్యతలు స్వీకరణ



కంచికచర్ల: కంచికచర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ-2గా యు.హైమావతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై వేధింపులు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటానని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చూస్తానని అన్నారు.

అవినీతి ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదు

ఆర్డీఓ రవీంద్రరావు



నందిగామ: రెవెన్యూ సిబ్బంది అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని ఆర్డీఓ ఏ రవీంద్రరావు హెచ్చరించారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఇద్దరు వీఆర్వోలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం నాలుగు మండలాలలో పనిచేస్తున్న వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది అవినీతి ఆరోపణలు లేకుండా ప్రజలకు సేవలందించాలన్నారు. అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం వస్తే ఉపేక్షించేది లేదన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్పందన ద్వారా వచ్చే అర్జీలపై అలసత్వం వహించకుండా వెంటనే విచారణ నిర్వహించాలన్నారు. ప్రతి రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

తుప్పుపట్టిన సైకిల్‌ను పాలేటిలో వేయాలి: సామినేని

బూదవాడ(జగ్గయ్యపేట): దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలను కులమతాలకు అతీతంగా సీఎం జగన్ పాలనలో అందిస్తున్నారని, ప్రజలు ఈ విషయం గమనించి, తుప్పుపట్టిన సైకిల్‌ను గ్రామంలోని పాలేటిలో వేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద జగనన్న సురక్ష క్యాంపును శనివారం అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉదయభాను మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ సేవలు కావాలంటే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బంది, వలంటీర్‌ల ద్వారా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి నేరుగా ఇంటి వద్దనే సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి బాలాజీ, తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీవో ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ దొంగల జానకిరామయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శ్రీను, బూడిద నరసింహారావు, బాల్యా, పరిటాల వెంకటేశ్వర్లు, భద్రాచలం,పారిశ్రామికవేత్త మట్టాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌరవరంలో..

స్థానిక గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమాన్ని నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు హనుమంతరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా 314 మందికి సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, గ్రామ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస గౌడ్, సొసైటీ అధ్యక్షుడు బాలసైదా, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, గంగూరి సాంబశివరావు, బూతుకూరి అప్పిరెడ్డి, గృహసారథులు, వలంటీర్‌లు, కార్యదర్శి జగ్గయ్య పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు మంచి చేయటమే లక్ష్యం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వెల్లంకి(వీరులపాడు): ప్రతి నిరుపేదకు మంచి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కొనియాడారు. ఇప్పటికే గ్రామాలలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, డ్రైన్‌లు, రోడ్ల నిర్మాణం జరిగిందని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ షేక్ హుస్సేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భిక్షమయ్య

కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఎస్టీయూ సంఘం ముందుంటుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య అన్నారు. మండలంలోని పేరకలపాడు, గండేపల్లి, కీసర, వేములపల్లి, పెండ్యాల, శౌరి అమరవరం గ్రామాల పాఠశాలలకు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, ఎంఈఓ-1 పోస్టులను జిల్లా పరిషత్ ఉపాధ్యాయులచే భర్తీ చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని భిక్షమయ్య అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిలకా విక్టర్, మాడుగుల బుచ్చిబాబు, షేక్ ఇస్మాయేల్, అంజిరెడ్డి, శేషం గోపాలరావు, జి.వెంకటేశ్వర్లు, నంద్రు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేటలో 81.85 శాతం మందికి పింఛన్ పంపిణీ



పేటలోని క్రిస్టియన్‌పేటలో పెన్షన్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం తెల్లవారు జాము నుంచే వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్డు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పట్టణంలోని 31 వార్డుల్లో ఉన్న వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31 వార్డులకు గాను మొత్తం 4,833 మంది పింఛన్ దారులకు గాను మొదటి రోజున 81.85 శాతం మందికి రూ 1,10,24,500 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు.

మండలంలో 80 శాతం పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో శనివారం మొదటి రోజు సామాజిక పింఛన్ల పంపిణీ 80 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తోందన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

జగ్గయ్యపేటఅర్బన్: డాక్టర్స్ డే సందర్భంగా శనివారం ప్రభుత్వాస్పత్రిలో వివిధ సేవలను అందిస్తున్న ప్రభుత్వ వైద్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, తుమ్మల నాగమణి, పఠాన్‌అక్బర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీల ఆధ్వర్యంలో...

కంచికచర్ల: డాక్టర్స్‌డే సందర్భంగా కంచికచర్లలో వీరులపాడు, కంచికచర్ల ఆర్‌ఎంపీలు కేక్ కట్ చేశారు. నందిగామలో ఆర్‌ఎంపీల అసోసియేషన్ భవన నిర్మాణానికి నాలుగు సెంట్లు స్థలం కేటాయిస్తామని, భవన నిర్మాణానికి రూ.లక్ష నగదు కూడా ఆర్థికసాయం అందిస్తామని ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

అన్నవరం (జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన సహకార సంఘ సభ్యుడు బెల్లంకొండ మోహన్ రావు(54) శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ తరఫున చైర్మన్ చలమల శ్రీనివాసరావు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మోహన్‌రావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

పలు ఆలయాలలో శనిత్రయోదశి పూజలు

నందిగామ: శనిత్రయోదశి సందర్భంగా పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, రామలింగేశ్వర్ నగర్‌లోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని శనైశ్వరునికి విగ్రహం వద్ద, గాంధీనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం వద్ద శనికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. పల్లగిరి కొండపై నవగ్రహ మండపం వద్ద, దాములూరు కూడలి, సోమవరం, గోళ్లమూడి, మాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో గల నవగ్రహ మండపాల వద్ద శనిత్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న పొంగులేటి

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహ స్వామిని తెలంగాణకు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో హేమలత దేవి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

బాటసారులకు బాదంపాలు పంపిణీ

నందిగామ: పట్టణానికి చెందిన సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో బాటసారులకు శనివారం బాదంపాలు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నిర్వహించారు.